ఎన్నికల ప్రచారానికి ఎండదెబ్బ



కాసిపేట, మే 6 : వారం రోజులుగా ఎండ లు దంచి కొడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటడంతో మధ్యాహ్నం ఎన్నికల ప్రచారానికి విరా మం ప్రకటిస్తున్నారు. ఎండ వేడికి భయపడి జనం కూడా బయటకు రాలేకపోతున్నారు. పార్లమెంట్ ఎన్ని కలను ఎండలు భయపెడుతున్నాయి. దీంతో అభ్యర్థు లు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రచారం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రచార వాహనా లు చెట్ల నీడకు చేరుకుని సేద తీరతున్నాయి. ఎండ తీవ్రత ఎన్నికల ప్రచారంపై ప్రభావం చూపుతోంది.

ఈవీఎంల ఉపయోగానికి 35 ఏళ్లు...

తొలిసారి 1989లో ప్రయోగాత్మకంగా అమలు



దండేపల్లి, మే 6: ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల పాత్ర కీల కంగా నిలుస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) ను మొదటిసారి 1989లో ఎంపిక చేసిన కొన్ని పోలింగ్ కేంద్రాల్లో విని యోగించారు. అనంతరం మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లోని 25 నియోజకవర్గాల్లో ఈవీఎంల సాయంతోనే పోలింగ్ జరిగింది. ఈవీఎంల ప్ర యోగం సత్ఫలితా లను ఇవ్వడంతో 2001లో తమిళనా డు, కేరళ, పుదు చ్చేరి, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో విని యోగించారు. 2004లో దేశ వ్యాప్తంగా లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో ఈవీఎంలను వాడారు. ఫలితంగా ఎన్నికల నిర్వహణ, లెక్కింపులో గణనీ యంగా మార్పులు చోటు చేసుకున్నాయి. 2018 నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు వీవీ ప్యాట్ యంత్రాలను వాడుతున్నారు. అభ్యర్థుల్లో ఎవరు నచ్చకున్నా ఓటు హక్కు వినియోగించుకునేలా నోటా బటన్‌ను 2013 లో ఎన్నిక సంఘం ప్రవేశపెట్టింది.

కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయం







కేకే 5 గనిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే, జనక్ ప్రసాద్, ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేక్, నెన్నెలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

మందమర్రి టౌన్, మే 6: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. సోమవారం 18వ వార్డులో ప్రచారం నిర్వహించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ కోలుకోలేని విధంగా దెబ్బతిన్నదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 60 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. వంశీకృష్ణ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంగా రాజకీయాల్లో వచ్చారన్నారు. వంశీకి 2 లక్షల మెజారిటీ లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్నారు. పార్టీలోకి పలువురు చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ప్రభాకర్‌రావు, నోముల ఉపేందర్, గుడ్ల రమేష్, బత్తుల సతీష్, శ్రీనివాస్, తిరుమల్‌రెడ్డి, జావేద్‌ఖాన్ పాల్గొన్నారు.

కార్మికులకు పెన్షన్ ఇప్పించినది కాకా వెంకటస్వామి

దేశ వ్యాప్తంగా కార్మికులకు పెన్షన్ మంజూరు చేయించిన ఘనత దివంగత కాకా వెంకటస్వామిదేనని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కేకే 5 గనిపై కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇందిరాగాంధీ పాలనలో పరిశ్రమలను జాతీయాకరణ చేస్తే మోదీ పాలనలో ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. అదాని అంబానీల ఆస్తులను పెంచే దిశగా ఆయన పని చేస్తున్నారన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ మాట్లాడుతూ తన తాత కార్మిక రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, సమ్మయ్య, దేవి భూమయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్లు లేకుండ చేసేందుకు కుట్ర

ప్రజాస్వామ్య పార్లమెంటరీ ఏర్పాటుకు కృషి చేసిన రాజ్యాంగంతోపాటు ఆయన పొందుపర్చిన రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీలు మండిపడ్డారు. ఐఎన్టీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014లో మోదీ మాటలను నమ్మిన ప్రజలు రెండుసార్లు అధికారం కట్టబెడితే కుల మతాల మధ్య చిచ్చుపెడుతూ మతోన్మాదాన్ని తెరపైకి తెచ్చి ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా చూస్తున్నారన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాలకు గడ్డం వంశీని గెలిపించాలని తెలిపారు.

పట్టణంలోని ఊరు మందమర్రిలో గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని నాయకులు బండి సదానందం యాదవ్ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నోముల ఉపేందర్, సొత్కు సుదర్శన్‌లు ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే గ్రామాల అభివృద్ధి

నెన్నెల: పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలిస్తే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నెన్నెలలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఉపాధిహామీ కూలీల కనీస వేతనాన్ని రూ.400లకు పెంచుతామన్నారు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఈ ప్రాంతంలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మల్లేష్, హరీష్‌గౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిసి ఓట్లు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉపాధిహామీ పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాపాడుకోవడం ఎలా..?

- ఎన్నికల వేళ ఊపందుకున్న ఫిరాయింపులు
- ప్రజా బలం ఉన్నోళ్లపై ప్రత్యేక దృష్టి
- చేరికలను ప్రోత్సహిస్తున్న ప్రధాన పార్టీలు

మంచిర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఫిరాయింపులు అధికమవుతున్నాయి. ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు క్రమంగా పెరుగుతున్నాయి. వివిధ పార్టీల నాయకులకు తలొగ్గు తున్న ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పార్టీలు మారుతున్నారు. బీఆర్ఎస్ మినహా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల్లో చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. క్రమేపీ పెరుగుతున్న వలసల కారణంగా అభ్యర్థులు మదన పడుతున్నారు.

పార్టీల్లోకి పెరుగుతున్న వలసలు....

పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ పార్టీల్లోకి చేరుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అగ్రనేతల నుంచి మొదలుకొని ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తల వరకు చేరికలు ఉంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రజా బలం ఉన్నోళ్లు, ద్వితీయ శ్రేణి నాయకులపై అభ్యర్థులు ఫోకస్ చేస్తున్నారు. నాయకులను తమ పార్టీల్లో చేర్చుకోవడం ద్వారా తమకు అనుకూలమైన ఓట్లు పెంచుకునేందుకు ఆరాట పడుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలు మారుతుండగా చేరికలతో ప్రధాన పట్టణాలు, ముఖ్య నాయకుల ఇళ్లు కళకళలాడుతున్నాయి. ఎవరు ఎప్పుడు పార్టీ మారుతారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాప్రతినిధులే టార్గెట్

సామాన్య కార్యకర్తలను చేర్చుకునే కంటే ప్రజాప్రతినిధులైతే మేలు చేకూరుతుందనే భావనతో ఆయా పార్టీల అగ్రనేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం పార్టీలు మారుతున్న వారిలో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు ఉండడమే ఇందుకు నిదర్శనం. ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు అయితే వారి ద్వారా ఓట్ల రూపంలో లబ్ధి పొందవచ్చుననే ఉద్దేశ్యంతో పార్టీలు మారేలా అవరమైన చర్యలు చేపడుతున్నారు. ఈ పరిస్థితి కాంగ్రెస్, బీజేపీల మధ్య అధికంగా ఉంది. ఇటీవల బెల్లంపల్లి, చెన్నూరు మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్, బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు.

జోరుగా ప్రచారం

ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రచారం జోరందుకొంది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తండ్రి గడ్డం వివేకానంద, పెద్దనాన్న గడ్డం వినోద్‌లతో కలిసి ప్రచారం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కేసీఆర్ రోడ్‌షో విజయవంతం కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కూడా ప్రచార శైలిలో వేగం పెంచారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యేలు సహకరిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

జిల్లాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, మే 6 : జిల్లాలో సోమవారం 46.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నస్పూర్‌లో 46.0 డిగ్రీలు, దండేపల్లిలో 45.9, కాసిపేటలో 45.7, భీమారంలో 45.2, భీమినిలో 45.2, నెన్నెలలో 45.1, జన్నారంలో 44.9, మంచిర్యాల, చెన్నూరులో 44.8, హాజీపూర్‌లో 44.5, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, జైపూర్‌లో 44.1, కన్నెపల్లిలో 44.0, మందమర్రిలో 43.9, తాండూర్‌లో 43.1, వేమనపల్లిలో 43.0,కోటపల్లిలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

జైపూర్, మే 6 : మండలంలోని నర్సింగాపూర్, మద్దులపల్లి, కుందారం గ్రామ సమీపాల్లో పులి సంచారం ఉన్నందున ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని గంగిపెల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమానస్పదంగా పాదముద్రలు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఒంటరిగా అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దన్నారు. అటవీ జంతువులకు ఎటువంటి హానీ కలిగించవద్దని సూచించారు.

దాడికి గురైన న్యాయవాదికి పరామర్శ

ఏసీసీ, మే 6 : ఖానాపూర్‌కు చెందిన న్యాయవాది వెంకట మహేంద్రపై ఈ నెల 3న దాడి జరగగా మంచిర్యాల బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సోమవారం ఖానాపూర్ వెళ్లి న్యాయవాదిని పరామర్శించారు. మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, స్పోర్ట్స్ సెక్రెటరీ సంతోష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు ప్రదీప్‌చంద్ర, శ్రీకాంత్‌లు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు

ఏసీసీ, మే 6 : జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వేసవి సెలవుల్లో ఎలాంటి శిక్షణ తరగతులు నిర్వహించకూడదని డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా తరగతులు నిర్వహించినట్లు తెలిస్తే నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లు



పార్టీలో చేరిన కౌన్సిలర్లుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, మే 6 : బెల్లంపల్లి మున్సిపాలిటీలోని పలు వార్డుల బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కౌన్సిలర్లు షేక్ అఫ్సర్, షేక్ అస్మా, కొక్కెర చంద్రశేఖర్, గురుండ్ల సత్యనారాయణ, గడ్డం అశోక్‌గౌడ్, చిట్యాల శ్రీలక్ష్మీమధులతో పాటు బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ ఎజాజ్, టీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడు షేక్ యూనిస్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ మంత్రి వేణుగోపాలచారి, నాయకులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, మే 6: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఉదయం 11 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఐఆర్‌సీఎస్ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి లయన్ వి.మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండాకాలం వల్ల రక్త నిల్వల కొరత ఉన్న దృష్ట్యా రక్తదాన శిబిరంలో రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

మంచిర్యాల కలెక్టరేట్, మే 6: నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న సెవెన్ హిల్స్ పాఠశాల, దొనబండలోని శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అభినవ్, తిరుపతిలు సోమవారం డీఈవోకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం సెలవుల్లో తరగతులు నిర్వహించకూడదని చెబుతున్నా పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మసీదు కమిటీ ఎన్నిక

ఏసీసీ, మే 6 : మంచిర్యాల పట్టణంలోని జామా మసీదు అడహక్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో నూరోద్దీన్, అజ్మతుల్లాఖాన్, ఇద్రిస్ అహ్మద్, రియాజ్ హుస్సేన్, ఉస్మాన్ సలోద్దీన్‌లను సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికలో మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రజాస్వామ్యం కూనీ అవుతుంది

కాసిపేట, మే 6: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రజాస్వామ్యం కూనీ అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దయి నియంత పాలన అమలులోకి వస్తుందన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేసేందుకు ప్రజాస్వామ్య వాదులపై నిర్బంధాలు విధించి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ ఆదానీ, అంబానీలకు పంచి పెట్టేందుకే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. బీజేపీ మాటలను ప్రజలు నమ్మవద్దని, బీజేపీని ఓడించాలన్నారు. రాష్ట్రంలో పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుని దాచుకుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల ఆదాయాన్ని సంపాదించిన కేసీఆర్‌కు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ పార్టీని బలపర్చి గడ్డం వం శీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, మండల కార్యదర్శి మల్లేష్, సత్యం, జాడి పోచం, సర్వేశం, శంకర్, రాయలింగు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చెత్తకుప్పలో పసికందు లభ్యం



జన్నారం, మే 6: జన్నారం మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీలో ఉన్న చెత్త కుప్పలో సోమవారం సాయంత్రం కొన్ని గంటల ముందే పుట్టిన ఆడశిశువును ఎవరో వదిలివెళ్లారు. సాయంత్రం 6 గంటల సమయంలో చెత్త కుప్ప నుంచి పసికందు ఏడుపు వినిపించడంతో సమీపంలో ఉన్న శ్రీలంక కాలనీకి చెందిన ప్రవీణ్ అనే యువకుడు చెత్త కుప్ప వద్దకు వెళ్లి పరిశీలించాడు. చున్నీలో చుట్టి ఉన్న పసికందు కనిపించడంతో వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు పసికందును స్థానిక పిల్లల ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ శిశువును పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇదే రోజు సాయంత్రం 4 గంటలకు శిశువు జన్మించి ఉంటుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ రాజవర్ధన్‌లు ఆసుపత్రికి వెళ్లి శిశువును పరిశీలించారు. అప్పటికే పోలీసులు శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్‌లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

చెన్నూరు, మే 6 : ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ సూచించారు. సోమవారం మండలంలోని కిష్టంపేట, కత్తెరసాల, కాచన్‌పల్లి, ఆస్నాద, నాగాపూర్, సోమనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి రశీదులు అందించాలని సూచించారు. అలాగే హార్వెస్టర్ ద్వారా జరిగే వరి కోతలను పరిశీలించి తగు సూచనలు చేశారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ధాన్యాన్ని వెంటనే తరలించాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్

మందమర్రిరూరల్, మే 6: సారంగపల్లి కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే తరలిం చాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు పేర్కొన్నారు. సోమవారం సారంగపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ నెలరోజుల క్రితం కేంద్రానికి ధాన్యం వచ్చినా కొనుగోలు చేయడం లేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనలేని ప్రభుత్వం బోనస్ ఎక్కడ నుంచి ఇస్తుందో రైతులు అర్థం చేసుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్, ఎండీ ఫిరోజ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



దేవాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జన్నారం, మే 6 : జన్నారంలో సోమవారం సాయంత్రం లక్సెట్టిపేట సీఐ నరేందర్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలందరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు పోలీసు నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఆర్ఎస్ఐ సుజిత్, బీఎస్ఎఫ్ సిబ్బంది , టీఎస్ఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సోమవారం పోలీస్‌స్టేషన్ నుంచి కొమురంభీ చౌరస్తా, అంగడి బజార్‌ఏరియా మీదుగా పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలపై భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసులకు ప్రజలందరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, బీఎస్ఎఫ్, పోలీసులు పాల్గొన్నారు.

కవి రవితేజకు ప్రశంసా పత్రం



రవితేజను సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

జైపూర్, మే 6: బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ ఆదివారం హైద్రాబాద్‌లో జరిగిన శ్రీశ్రీ కళావేదిక, కర్ణాటక సాహిత్య మందిర్‌లో ఆధ్వర్యంలో నిర్వహించిన శతాధిక ద్విభాష కవి సమ్మేళనంలో గట్టడ మెట్టోడ గావురాల మల్లు అనే కవితను వినిపించారు. దీంతో రెండు సంస్థల సభ్యులు రవితేజను సన్మానించి ప్రశంసా పత్రం అందించారు. కళావేదిక చైర్మన్ ప్రతాప్, కవయిత్రి జోష్యుల ప్రభశాస్త్రి, కన్నడ, తెలుగు కవులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడిగా మహేష్

ఏసీసీ, మే 6 : తెలంగాణ మున్నూరు కాపు యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మూగాల మహేష్ పటేల్ నియమితులయ్యారు. సోమవారం హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య మహేష్ పటేల్‌కు నియామకపత్రం అందించారు. మహేష్ మాట్లాడుతూ ఈ పదవీ రావడానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలు ధ్వంసం చేశారు

మంత్రి శ్రీధర్ బాబు



సుల్తానాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

సుల్తానాబాద్, మే 6: బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలను ధ్వంసం చేశారని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు అన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా పూసాల రోడ్డులో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి పెద్దపల్లి ప్రాంతంలో రాజీవ్ రహదారిని సికింద్రాబాద్ నుంచి చెన్నూర్ ఎక్స్‌రోడ్డు వరకు పొడిగించారన్నారు. బీజేపీకి సంబంధించి ఇద్దరు వ్యక్తులతో నడిపిస్తున్నారని, ఒకరు మోదీ మరొకరు అమిత్‌షాలు మాత్రమేనన్నారు. మోదీ గ్యారంటీ ఆధానికి అంబానిలకు మాత్రమే ఇస్తారని విమర్శించారు. దేశాన్ని లూటీ చేసి ఇతర దేశాలకు తరలించుకుపోయిన వారికి మద్దతు ఇస్తున్న బీజేపీ రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే హక్కు నడ్డాకు లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇరవై కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన బీజేపీ కేవలం ఐదు లక్షల మందికి మాత్రమే ఇచ్చి యువతను మోసం చేసిందని అరోపించారు. బీజేపీ నాయకత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తిరిగి రాయిస్తామంటే ఈ ప్రాంత ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీలు ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. రిజర్వేషనులు ఎత్తి వేసే కార్యక్రమం నడుస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లు వేస్తే వృథా అవుతాయని అలోచించి చేతి గుర్తుకు ఓటు వేయాలన్నారు. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, ఎమ్మె ల్యే విజయరమణారావు, అభ్యర్థి గడ్డం వంశీ మాట్లాడారు.

క్యాంపెయినింగ్ కమిటీ చీఫ్ కోఆర్డినేటర్‌గా జనక్ ప్రసాద్

మందమర్రి టౌన్, మే 6: క్యాంపెయినింగ్ కమిటిచీఫ్ కోఆర్డినేటర్ రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ బి జనక్‌ప్రసాద్‌ను నియమిస్తూ క్యాంపెనింగ్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగాప్రచారం చేపట్టామని తెలిపారు. బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు రూ. 600 వేతనం ఇవ్వాలి

కన్నెపల్లి, మే 6: ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం మెట్‌పల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసేం దుకు కుట్రలు చేస్తోందన్నారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వారానికి ఒకసారి వేతనాలు చెల్లించాలని, జాబ్‌కార్డు ప్రతి కూలీకి 200 రోజులు పనులు కల్పించాలని, పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజన్న, నరేష్, రంగయ్య కూలీలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా సంతోష్‌యాదవ్

దండేపల్లి,మే 6:దండేపల్లి మండల కేంద్రానికి చెందిన అల్లంల సంతోష్‌యాదవ్ దండేపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం దండేపల్లిలో జరిగిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. దండేపల్లి గౌరవ అధ్యక్షుడిగా బొమ్మెన మహేష్, అధ్యక్షుడిగా అల్లంల సంతోష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా అల్వాల సత్యం, ఎండి ఖాజా, ప్రధాన కార్యదర్శిగా వేమునూరి లక్ష్మీనారాయణ, కోశాధికారిగా అరిగెల సురేష్, ప్రధాన సలహాదారులుగా మేడవేని సత్తన్న, టేకుమట్ల చెంద్రయ్యలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

ప్రచారంలో నీడలా నిఘా బృందాలు


అంతర్రాష్ట్ర వంతెన వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోటపల్లి, మే 6: లోక్‌సభ ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు తమ ప్రచారాలకు పదును పెడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తాయిలాల ఆశ చూపెడుతున్నారు. ఈ దిశగా అభ్యర్థుల ఖర్చులను నియంత్రించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. డబ్బు, మద్యం, కానుకలు, మాదకద్రవ్యాలు లాంటి ప్రలోభాల పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టే నిధులకు సంబంధించి ప్రతి పైసా లెక్కించేందుకు ఈసారి ఎన్నికల సంఘం 20 శాఖలను భాగస్వామ్యం చేసింది. రాజకీయ పార్టీలనేతలు అభ్యర్థుల ప్రచారంలో ఈ అధికారుల బృందాలు నీడలా వెంటాడుతూ వారిని కట్టడి చేస్తున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల వ్యయ పరిశీలకులు వీటిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నారు.

● **అన్ని శాఖల సమన్వయంతో...**

ఎన్నికల వ్యయ క్రతువులో సుమారు 20 శాఖలు భాగస్వామ్యమై సమన్వయంతో ముందుకు వెళ్తున్నాయి. రెవెన్యూ, పోలీసు, ఇంటలిజెన్స్, ఇన్‌కంటాక్స్, అటవీ, ఎక్సైజ్, తపాల, జీఎస్టీ, సీజీఎస్టీ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, సివిల్ ఏవియేషన్, ఆర్‌బీఐ, రైల్వే, కస్టమ్స్, ఎన్‌సీబీ, ట్రాన్స్‌పోర్టు, ఈడీ, స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ, పర్యాటక, సీఐ ఎస్‌ఎఫ్ లాంటి శాఖలు ఉన్నాయి. ఈ శాఖలన్నీ అభ్యర్థుల వ్యయ ఖర్చులపై నీడలా వెంటాడుతూ వారిచేసే ఖర్చులను లెక్కిస్తూ జిల్లా యంత్రాం గానికి నివేదికలు పంపుతున్నారు. నియోజకవర్గానికి ఒక వ్యయబృందాన్ని నియమించారు. ఆయా శాఖలను సమన్వయం చేస్తూ అభ్య ర్థుల వ్యయాన్ని లెక్కిస్తున్నారు.

● **ఖర్చులపై షాడో రిజిష్టర్**

అభ్యర్థులు చేస్తున్న వ్యయంపై నియోజకవర్గాల వారీగా షాడో రిజి ష్టర్‌లో లెక్కలు నమోదు చేస్తున్నారు. గతంలో ఎన్నికల వ్యయ పరిశీల కులు నామినేషన్‌ల స్వీకరణ సమయంలో మూడు రోజులు ఉండి ఉపసంహరణ తర్వాత వచ్చి ఓట్ల లెక్కింపు అయ్యే వరకు పర్యవేక్షిం చేవారు.

ప్రస్తుతం నామి నేషన్‌ల పత్రాల స్వీకరణ నుంచి ఇక్కడే మకాం వేస్తూ అభ్యర్థుల వ్యయాన్ని నమోదు చేస్తున్నారు. అభ్యర్థుల ప్రచారంతోపాటు ఇతర ఆర్థిక వ్యవహా రాలను ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆయా రిజిష్టర్‌ల లెక్కల ఆధారంగానే అభ్యర్థులు చేసిన ఖర్చును లెక్కించనున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజల సంక్షేమం

బెల్లంపల్లి, మే 6: బీఆర్‌ఎస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం బూదాకలాన్‌లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తాను ప్రజల మధ్య ఉండే వ్యక్తిన ని, ప్రజల కోసం పనిచేసేవాడనని తెలిపారు. అనంతరం శాంతిఖని గని వద్ద కార్మికులను కలిసి కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

కాసిపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆమె మాటాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మాయమాటలు చెబుతుందన్నారు. పల్లె చంద్రయ్య, రాంచందర్, చంద్రమౌళి, లక్ష్మీ, రమణారెడ్డి, అగ్గి సత్తయ్య, బుగ్గ రాజు పాల్గొన్నారు.

హాజీపూర్: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. పెద్దంపేట, హాజీపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మందపల్లి శ్రీనివాస్, కిష్టయ్య, పాల్గొన్నారు.

దండేపల్లి: హామీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు అన్నారు. మండల కేంద్రంతోపాటు నెల్కివెంకటాపూర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. చుంచు శ్రీనివాస్, పసర్తి అనిల్, భూమన్న, రాజమల్లు, సంతోష్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకు లు కోరారు. 22వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహిం చారు. కార్మికుడిగా పనిచేసిన ఈశ్వర్ ఎంపీగా విజయం సాధిస్తే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అ వుతాయని పేర్కొన్నారు. విజిత్ కుమార్, కౌన్సిలర్లు తిరు పతి, కురిమిళ్ల అన్నపూర్ణ, సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే మాదిగల మద్దతు

చెన్నూరు, మే 6: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే మద్దతు ఇస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లాఅధ్యక్షుడు తగరం మధురాజ్ తెలిపారు. సోమ వారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నాయ న్నారు. ప్రాంతీయ పార్టీల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చన్నారు. బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పులఈశ్వర్ గెలుపునకు మాదిగలంతా కృషి చేయా లని కోరారు. పట్టణాధ్యక్షుడు శ్రావణ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, ఇన్‌చార్జి అశోక్, కార్యదర్శి రాజు,నరేందర్, శ్రీనివాస్, పోశం, రాజు, సురేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఏసీసీ, మే 6 : మంచిర్యాల పట్టణంలోని ఎంసీసీలో ఎంసీడబ్ల్యూఈఈఎస్ ఉన్నత పాఠశాల 2005-06పదవ తరగతిబ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం పట్టణంలోని ప్రైవేటుహాలులో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు. విద్యార్థిదశలోని జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో గుమ్ముల నాగరాజు, రమేష్, శ్రావణ్, రజిత, మౌనిక, శైలజ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకుల ప్రచారం

భీమారం, మే 6: బూరుగుపల్లి, నర్సింగాపూర్, ఖాజీపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓట్లు వేయాలని కోరారు. ఉపాధిపనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లువేయాలని అభ్యర్థించారు. లక్ష్మణ్, పున్నంచంద్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని మండలంలోని ఊరురా కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని కాంగ్రెస్‌శ్రేణులు ఉదయం, సాయంత్రంవేళ్లలో ఇంటింటికి కరపత్రాలతో ప్రచారం చేశారు.

పనివేళల మార్పుపై గందరగోళం

● స్థానికంగానే నిర్ణయించుకోవాలని ఆదేశం ● రేపు జీఎం వద్ద సమావేశం ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు



శ్రీరాంపూర్, మే 6: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ఓసీపీలు, సీహెచ్‌పీలతోపాటు ఇతర అవుట్ డోర్ పనులు చేసే కార్మికుల పనివేళలు మార్చాలని కార్మికుల నుంచి పలు విజ్ఞప్తులు వచ్చాయి. గతంలోనూ అలా మార్చిన సందర్భాలున్నాయి. కానీ యాజమాన్యం మాత్రం డ్యూటీ టైమింగ్ మార్చడానికి మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా అధిక ఉష్ణోగ్రతలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

సీఎండీని కలిసిన నాయకులు..

ఈ నేపథ్యంలో పనివేళల మార్పుపై ఏఐటీయూసీ యూనియన్ నాయకులు సోమవారం సీఎండీ ఎన్ బలరాంను కలిశారు. మొదటి బదిలీ ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, రెండ బదిలీ సాయంత్రం 4నుంచి రాత్రి11గంటల వరకు, మూడవ బదిలీ రాత్రి 11నుంచి ఉదయం 7గంటల వరకు మార్చాలని కోరారు. ఆయన మాత్రం డ్యూటీ టైమింగ్ మార్చడం కుదరదని, స్థానిక ఏరియా జీఎంలతో మాట్లాడి నిర్ణయించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గు రవాణా నిలిచిపోవద్దని సూచించినట్లు సమాచారం. దీంతో చర్చలు జరిపేందుకు మంగళవారం జీఎం కార్యాలయానికి రావాలని ఏఐటీయూసీ నాయకులకు ఆహ్వానం అందింది.

చర్చలు ఏమవుతాయో ?

పనివేళలు మార్చాలని, ఎనిమిది పనిగంటలకు బదులుగా ఆరు పనిగంటలు ఉండాలని కార్మికవర్గం కోరుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఓసీపీలు, సీహెచ్‌పీలు, వర్క్‌షాప్‌లు, తదితర ప్రాంతాల్లో డ్యూటీటైమింగ్ గురించి తెలుపుతూ నోటీసులు అంటించారు. కానీ అందులో పనిగంటల తగ్గింపు ప్రస్తావన లేదు. మంగళవారం జీఎం కార్యాలయంలో జరిగే చర్చల్లో ఈ విషయం గురించి చర్చకు వస్తుందా? నాయకులు ప్రస్తావించినా యాజమాన్యం ఒప్పుకుంటుందా? అని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సింగరేణి వ్యాప్తంగా ఒకే నిర్ణయం తీసుకొని సర్క్యులర్ ఇస్తే అమలుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, స్థానిక ఏరియాలలో నిర్ణయం తీసుకోవాలంటే యాజమాన్యం యూనియన్ల మాటను పట్టించుకోకపోవచ్చునని కార్మికులు భావిస్తున్నారు. దీనివల్ల ఎండ వేడిమితో తమకు ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. అయినా 20 రోజులపాటు పనివేళలు మార్చేందుకు వచ్చిన సమస్య ఏమి టని కార్మికులు ప్రశ్నిస్తు న్నారు. యాజమా న్యానికి కేవలం బొగ్గు ఉత్పత్తి, రవాణాపై మాత్రమే ఆసక్తి ఉందని, కార్మికుల రక్షణ, ప్రాణాలపై లేదని విమర్శిస్తున్నారు. ఇంత ఎండ వేడిమిలో తాము అనారోగ్యం పాలైతే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ రోడ్‌షో

భీమారం, మే 6 : భీమారం మండల కేంద్రంలో పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకుడు దుర్గం అశోక్‌లు సోమవారం రోడ్‌షో నిర్వహించారు. ఆవడం క్రాస్ రోడ్డు నుంచి భీమారం బస్టాండ్ వరకు కొనసాగింది. జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ పదేండ్లలో ప్రధాని మోదీ దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కమల పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు.

బీజేపీలో చేరిక

కోటపల్లి, మే 6: మండలంలోని శెట్‌పల్లి ఉపసర్పంచు గోనె మోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి బీజేపీ లో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మోహన్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోహన్‌రెడ్డి వెంట మరో 10 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

చెన్నూరు, మే 6 : చెన్నూరు పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సూర్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, రవి, సత్యనారాయణగౌడ్, వెంకటేష్, రాజబాబు, శ్రీధర్, రాకేష్,అఖిల్, సంతోష్, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తస్రావంతో బాలింత మృతి



రవళిక (ఫైల్)

మంచిర్యాల కలెక్టరేట్, మే 6: బెల్లంపల్లి పట్టణానికి చెందిన రవళిక (26) అనే బాలింత మృతి చెందిన సంఘటన సోమవారం చర్చనీయాంశమైంది. మృతురాలు కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం రవళికను ప్రసవం కోసం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నందిని ఆసుపత్రికి తీసుకు వచ్చారు. వైద్యులు సాధారణ ప్రసవం చేయగా శిశువుకు జన్మనిచ్చింది. రవళికకు తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే సమీపంలోని మెడిలైఫ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవళిక మృతి చెందింది. దీంతో మృతురాలు కుటుంబీకులు, బంధువులు నందిని ఆసు పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లనే మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది ఆసుపత్రిని మూసివేశారు. అనంతరం మెడిలైఫ్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. డెలివరీ చేసిన వైద్యురాలు నందిని వచ్చే వరకు మృతదేహాన్ని తీసుకువెళ్లమని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న సీఐ బన్సీలాల్ పోలీసులతో ఆసుపత్రికి వద్దకు చేరుకుని మృతురాలు కుటుంబీకులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. శిశువు అనారోగ్యంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు మృతురాలు భర్త వెంకటేష్ తెలిపారు.

పెళ్లి ఇంట్లో విషాదం

-కూతురును అత్తారింటికి పంపి గుండెపోటుతో తండ్రి మృతి



ఎజాజ్ (ఫైల్)

చెన్నూరు, మే 6: పట్టణానికి చెందిన ప్రిన్స్ కంగన్ హాల్ యజమాని ఎజాజ్ (56) గుండె పోటుతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆదివారం రాత్రి ఎజాజ్ పెద్ద కూతురు వివాహాన్ని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో మత పెద్దలు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిపించారు. వివాహ వేడుకలు ముగిసిన కూతురును మంచిర్యాలలోని అత్తగారింటికి పంపి రాత్రి 1 గంటకు ఎజాజ్ ఇంటికి చేరుకున్నాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఛాతిలో నొప్పి ఉందని కుప్పకూలిపోయినట్లు బంధువులు తెలిపారు. బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు ఎజాజ్ అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. కుటుంబ యజమాని హఠాన్మరణంతో పెళ్లి ఇంట్లో విషాదం అలుముకుంది. ఎజాజ్ మృతి పట్ల పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు, మిత్రులు సంతాపం తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి వాహనం దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జైపూర్, మే 6: మండలంలోని నర్వ గ్రామంలో సోమవారం సాయంత్రం విద్యుత్ తీగలకు తగిలి వరిగడ్డి లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం దగ్ధమైంది. తిర్యాణి మండలానికి చెందిన శ్రీకాంత్ బొలేరో వాహనంలో నర్వ గ్రామం నుంచి వరి గడ్డిని తీసుకువెళ్తుండగా గ్రామ సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలకు గడ్డి తగలడంతో మంటలు చెలరేగాయి. దీంతో వరిగడ్డితోపాటు వాహనం దగ్ధమైంది. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మంచిర్యాల ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం కాలిపోయింది. సుమారు రూ. 7 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. డ్రైవర్ చాకచక్యంగా నిప్పంటుకున్న వాహనాన్ని గ్రామ శివారుకు తీసుకురావడంతో పెద్ద ముప్పు తప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

గ్రామాల తరలింపునకు మార్గం సుగమం



- మైదాన ప్రాంతంలో పునరావాసం ఏర్పాట్లు
- అడవుల్లో వసతుల్లేక ప్రజల ఇబ్బందులు
- అధికారుల ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల ప్యాకేజీ

మంచిర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ రిజర్వు ఫారెస్టు పరిధిలో గ్రామాల తరలింపునకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. మరికొద్ది రోజుల్లో కవ్వాల్ అభయారణ్యంలోని మిగతా గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తామన్న అటవీశాఖ ఉన్నతాధికారుల ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యం దట్టమైన అటవీ ప్రాంతం కావడం, టైగర్ రిజర్వు ఫారెస్టుగా ప్రకటించడతో గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించాలని అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా గ్రామాల తరలింపునకు మోక్షం కలగకపోవడంతో రిజర్వు ఫారెస్టు పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టైగర్ జోన్‌గా ఏర్పాటు చేయడం ద్వారా పులులకు ఆ ప్రాంతంలో ఆవాసంతోపాటు రక్షణ కల్పించేందుకు అటవీశాఖ నిర్ణయించింది. నానాటికి పులుల సంఖ్య తగ్గిపోతుండటంతో దాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అటవీ క్షేత్రాలను, అభయారణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా టైగర్‌జోన్‌గా తీర్చి దిద్ది, పులులు, ఇతర వన్య ప్రాణులకు ఆవాసం కల్పించాలని కసరత్తు ప్రారంభించారు.

పులులకు శాశ్వత ఆవాసం కోసం

పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ఇంద్రావతిలోని తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వు ఫారెస్టులు కవ్వాల్ అభయారణ్యాన్ని ఆనుకొని ఉండటంతో అక్కడి నుంచి పులులు వచ్చి, పోతూ ఉండటంతో ఇక్కడ వాటికి శాశ్వత ఆవాసం కల్పించాలని సంకల్పించారు. ఇందు లో భాగంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంతోపాటు నిర్మల్ జిల్లాలోని కడెం మండలాన్ని కవ్వాల్ టైగర్‌జోన్‌గా ఏర్పాటుచేశారు. జనసంచారం, అలికిడి ఉంటే పులులు నివాసం ఉండవనే ఉద్దేశ్యం తో కవ్వాల్ అటవీ ప్రాంతంలోని గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించాలని నిశ్చయించారు.

అభివృద్ధికి నోచుకోని ఆదివాసీలు

కవ్వాల్ టైగర్ జోన్‌లో భాగంగా అధికారులు మైదాన ప్రాంతానికి తర లించే గ్రామాలను ఎంపిక చేయడంతో ఇక్కడ అభివృద్ధి కుంటుపడింది. ఎలాగూ గ్రామాలు తరలిపోతాయనే ఉద్దేశ్యంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆదివాసీ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. గ్రామాలను తరలించక పోగా, అభివృద్ధి కూడా చేపట్ట కపోవడంతో ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాలుగా గ్రామాల్లో రహదారుల సౌకర్యం లేక పోవడమేగాక విద్య, వైద్యానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పోడు భూముల్లో సాగుచేసి పండించిన పంటను విక్రయించేందుకు సైతం రవాణా సౌకర్యం లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్సకు వెళ్లాలంటే సరైన రవాణా మార్గాలు అందుబాటులో లేవు. జన్నారం మండలంలోని దొంగపెల్లి గ్రామ ప్రజలు మైదాన ప్రాంతానికి చేరుకోవాలంటే కనీసం 18 కిలోమీటర్ల మేర నడవాల్సి ఉంటుంది. కేవలం నిధులు మంజూరు కాకనే గ్రామాల తరలింపు ప్రక్రియ నిలిచి పోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అటవీ అధికారుల ప్రకటనతో

కవ్వాల్ పులుల అభయారణ్యంలోని నిర్మల్ జిల్లా మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన 94 కుటుంబాలకు పునరావాసం కల్పించగా, జన్నారం మం డలంలోని గ్రామాలను మరికొద్ది రోజుల్లో తరలించనున్నట్లు పీసీసీ ఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.15 లక్షల పరిహారంతో పాటు 333 చదరపు గజాల్లో ఇల్లు, 2.81 ఎకరాల సాగుభూమిని అందజేయనున్నారు. అలాగే పునరావాస కాలనీల్లో సామాజిక ఏర్పాట్లు చేయనున్నారు.

గ్రామాల తరలింపునకు ఆమోదం

కవ్వాల్ టైగర్‌జోన్ కోసం సుమారు 15 గ్రామాలను తరలించాలని అటవీశాఖ ఆధ్వర్యంలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో భాగంగా జన్నారం డివిజన్‌లోని అల్లీనగర్, దొంగపెల్లి, మల్యాలతోపాటు నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. మొదటి విడుతలో భాగంగా నిర్మల్ జిల్లాలోని మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలకు భూ పట్టాల పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు లేదా అదే ప్యాకేజీలో సరిపడ ఇల్లు నిర్మించడంతోపాటు ఉపాధి కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

ఈ మేరకు నిర్మల్ జిల్లా కడెం మండలంలోని గ్రామా లకు కొత్తమద్దిపడగ శివారులో భూములు కేటా యించగా ఇటీవల గ్రామాలను అధికారులు పున రావాస కేంద్రాలకు తరలించారు. ఇదిలా ఉండగా జన్నారం మండలంలోగల అల్లీనగర్, దొంగపెల్లి, మల్యాల గ్రామాల తరలింపునకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మూడు గ్రామాల్లో 265 కుటుంబాలు ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. ఈ కుటుంబాలను మైదాన ప్రాంతానికి తరలిస్తే గానీ కవ్వాల్ టైగర్ రిజర్వులో పులి ఆవాసం ఉండే పరిస్థితి లేదు.

అధికా రుల ప్రకటనతో ఇంతకాలం కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డ అడవి బిడ్డలు, త్వరలోనే మైదాన ప్రాంతంలోని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్ళే అవకాశం ఉంది.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



మృతుడు దుర్గేష్ రామ్‌కరణ్

కాసిపేట, మే 6: పెద్దనపల్లి శివారులోని న్యూ కాలనీ సమీపంలోని మామిడి తోటలో ఐదేళ్ల బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం మధ్యప్ర దేశ్ రాష్ట్రానికి చెందిన రామ్‌కరణ్ రామ్‌ప్రసాద్ అనే కూలీ భార్య ముగ్గురు పిల్లలతో కలిసి ఉపాధి కోసం పెద్దనపల్లికి వచ్చాడు. ఆదివారం మధ్యా హ్నం మామిడికాయలు తెంపి రాత్రి పడుకున్న తరువాత చిన్న కొడుకు దుర్గేష్ రామ్‌కరణ్ (5) కుడి చేతిపై వాపు కనిపించగా వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. రామ్‌కరణ్ ఏదైన విషపురుగు కుట్టుడం వల్లనో లేక మరేదైన అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని, తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఎన్‌పీఎల్ క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేత

ఏసీసీ, మే 6 : మంచిర్యాలలోని ఎన్‌టీఆర్ నగర్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌టీఆర్ నగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు సోమ వారం బహుమతులు అందించారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఎస్ఆర్‌హెచ్ టీం, సీఎస్‌కె టీంలు తలపడగా సీఎస్‌కేటీం విజేతగా, ఎస్ఆర్‌హెచ్ టీం రన్నర్‌గా నిలి చింది. బహుమతులను డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్ చేతుల మీదుగా అందించారు. తాజ్,నగేష్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవాదళ్ సభ్యుల ప్రచారం

తాండూర్, మే 6 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని సోమవారం కిష్టంపేటలో సేవాదళ్ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. నీలకంటేశ్వర్‌రావు, హనీఫ్‌ఫుల్‌రహెమాన్, గట్టయ్య, ఆయూబ్, రత్నాకర్‌రావు, శంకర్, మోమిన్‌అలీ, స్వామి, రవికుమార్, మల్లేష్,రాయమల్లు, తిరుపతి, దామయ్య, పాల్గొన్నారు.

పూలాజీ బాబా ఆశయాలు కొనసాగించాలి



కెరమెరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి, మే 6: పూలాజీ బాబా ఆశయాలను కొనసాగిస్తూ ఆధ్యాత్మికతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం గోయగాం గ్రామంలోని ధ్యానకేంద్ర వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ధ్యానం చేయడం వల్ల అనేక సమస్యలు దూరమవుతాయని తెలిపారు. నేటి సమాజంలో ప్రతిఒక్కరూ ధ్యానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ధాన్యంలోనే పరమాత్ముడు దాగి ఉన్నాడన్నారు. ధ్యానంతోనే మానవాళి మనుగడ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్యాంనాయక్, సరస్వతి, బాబా తనయుడు కేశవ్ ఇంగ్లె, ఆలయకమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, శంకర్, పాండురంగ్, పోశెట్టి, బాపూజీ, పాండు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన వారికే పట్టం కట్టండి..

జైనూర్: రాష్ట్రాన్ని అభివృద్ధిచేసిన బీఆర్ఎస్ పార్టీకే ఓటువేసి భారీ మెజార్టీతో ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కును గెలిపించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి కోరారు. సోమవారం పార్లమెంట్ ఎన్ని కల్లో భాగంగా బూసిమెట్ట క్యాంప్, రాసిమెట్ట, డబోలి, గారెన్‌గూడ తదితర గ్రామాల్లో ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయాగ్రామాల్లో ఇంటింటికి తిరిగిప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మర్సుకోల సరస్వతి, కుమరం సోనేరావు, ఎంపీపీ కుమ్ర తిరుమల, కనక యాదవ్‌రావు, మడావి భీంరావు, ఇంతియాజ్‌లాలా, ఆత్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు

బెల్లంపల్లి, మే 6 :పెద్దపల్లి పట్టణంలో సోమవారం జరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్రసభకు పట్టణం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరైన ఈ సభకు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడిరమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకవాహనాల్లో తరలివెళ్లారు.

తాండూర్: బీజేపీ మండలాధ్యక్షుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, సుధీర్‌గౌడ్, మహీధర్‌గౌడ్, చిరంజీవి, తుకారం, కుమార్, శ్రీనివాస్, మల్లేష్, ప్రదీప్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు సంకల్ప సభకు తరలివెళ్లారు.

బీజేపీలో నూతన ఉత్తేజం

● కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగ సభ సక్సెస్

కాగజ్‌నగర్, మే 6: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన వికాస సంకల్ప సభ సక్సెస్ కావటంతో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తోంది. అమిత్ షా స్టేజీ ఎక్కగానే మోదీజీని గెల్పించాలంటూ అంటూ పెద్ద పెట్టున మంత్రి నినాదాలు చేశారు. అందుకు సభ నుంచి కూడా తగిన విధంగా ప్రతిస్పందన రావడంతో ఆయన తన ప్రసంగాన్ని నేరుగా ప్రారంభించారు. ప్రసంగంలో రాహుల్ గాంధీని రాహుల్ బాబా అంటూ సెటైర్లు వేస్తూ చురకలను అంటించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రధాన ఆలయాల దేవుళ్లను ప్రస్తావించటం, గిరిజనుల ఆరాధ్యదైవమైన కుమరం భీం, కొండాలక్ష్మణ్, రాంజీగోండ్, కొండా లక్ష్మణ్ బాపూజీలతో పాటు బంజార్ భగవాన్ సేవాలాల్ స్మరిస్తూ సభను ముగించారు. సభకు సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల నుంచే కాకుండా ఉమ్మడిజిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎండవేడిమి ఎక్కువగా ఉన్నప్పటికీ అమిత్‌షాను చూసేందుకు జనం ఓపికగా ఉన్నారు. ప్రజలందరికీ తాగునీరు అందించారు. ఉదయం, సాయంత్రం రెండు మార్లు కార్యకర్తలకు భోజన వసతి కల్పించారు. సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సభ అనంతరం అందరూ భోజనం చేసి వెళ్లాలని పదే పదే ప్రస్తావించారు. దీనినిబట్టి స్థానికనాయకులు సభ విజయ వంతానికి, సభకు హాజరైన ప్రజల సౌకర్యాలకు ఎంతటి ప్రాముఖ్యతినిచ్చారో అర్థం చేసుకోవచ్చు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి



పెంచికలపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్



వాంకిడిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జైనూర్, మే 6: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీమెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ఇంటింటికి తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ కాంగ్రెస్‌పార్టీ కండువ కపి అహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాథోడ్ శేషారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, నాయకులు దుర్రే సుబాష్, రహిం, అబ్బు, వాసీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

పెంచికలపేట: గ్రామాలఅభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కొండపల్లి, ఏల్లూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. పేదింటి ఆడబిడ్డను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఏల్లూరు గ్రామానికిచెందిన సంపుటంబాపు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట నాయకులు బండు, తిరుపతి, సంజీవ్, సాజీద్,లచ్చన్న, వాగన్న తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణక్కను గెలిపించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్‌నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరుగ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్ర మంలో నాయకులు నారాయణ, ప్రశాంత్, అశోక్, పోశెట్టి, రమేష్, పండు, పొచ్చు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని మేటిగూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పార్టీ చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమలను వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అన్నివర్గాల సంక్షేమంకోసం కాంగ్రెస్‌పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండలంలోని ఆరెగూడ, దేవాయిగూడ, చౌపిడి, ఉల్లిపిట్ల,పంగిడి, బుగ్గగ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి సుగుణను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, శంకర్, లక్ష్మణ్, అమర్,రాజశేఖర్, వెంకటేశంగౌడ్, లచ్చన్న, శంకర్, రంజిత్, రాజశేఖర్, కొండయ్య పాల్గొన్నారు.

సిర్పూర్(టి): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, కీజర్ హుస్సేన్, మహేష్, అఖీల్, ఇప్తుస్సేన్ పాల్గొన్నారు.

కౌటాల: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు: గోడం నగేష్



తిర్యాణిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గొడెం నగేష్



దహెగాంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీనాయకులు

తిర్యాణి,మే 6: ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా బీజేపీ గెలుపు ఆపలేరని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. సోమ వారం మండలకేంద్రంలోని శిశుమందిర్ పాఠశాల ఆవరణలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఈ సారి బీజేపీ విజ యాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రతికార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, కిరణ్ కుమార్, సొల్లు లక్ష్మి, రమేష్‌గౌడ్, వెంకటేష్, సుభాష్, గోపాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తోనే అభివృద్ధి

-ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి): బీజేపీతోనే దేశం, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమ వారం మండలంలోని లోనవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లు, పేదలకు అయిదు కిలోలల బియ్యం, ఉపాధిహామీ పథకం పనులు కేంద్రప్రభుత్వంతోనే అందు తున్నాయన్నారు. ఎంపీ అభ్యర్థి గొడెం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

దహెగాం: మండలంలోని పెసరికుంట గ్రామంలో ఇంటింట తిరుగుతూ కరపత్రాలు పంచుతూ బీజేపీ మండలాధ్యక్షుడు ధనుంజయ్ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి గోడంనగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి, మే 6: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని సరండి, నర్లాపూర్, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎంపీగా ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, తుకారాం, కమలాకర్, కిష్టు, ఆర్.కమలాకర్, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు రాజు, కిశోర్ కోరారు. సోమవారం మండలంలోని చీలపల్లి, మెట్‌పల్లి, రావన్‌పల్లి, మాలిని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు.

చెస్ అసోసియేషన్ కార్యవర్గం


కాగజ్‌నగర్, మే 6: జిల్లా నూతన చెస్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రహమాన్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఈగ కనకయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా సంపత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌రావు, వైస్ ప్రసిడెంట్‌గా ఉపేందర్, ప్రధానకార్యదర్శిగా కల్పన, జాయింట్ సెక్రెటరీగా ఎం రవీందర్, ట్రేజరర్‌గా పి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం శృతిక, డి శ్రీహర్షితను ఎన్నుకున్నట్టు వారు ప్రకటించారు.

అభ్యసన సామర్థ్యాలను పెంచడంలో పఠన నైపుణ్యం గొప్పది: కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 6: బాల్యం నుంచే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం ద్వారా వారిలో మౌఖికభాషా వికాస అభివృద్ధితోపాటు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించవచ్చని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్‌తో కలిసి రూం టు రీడింగ్ ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో అభ్యసన కొనసాగింపు కొరకు రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్, జిల్లా విద్యాశాఖ సహకారంతో రూపొందించిన 040-4520-9722 నెంబర్ డయల్ చేస్తే విద్యార్థులకు ఆకర్షణీయమైన అభిరుచిని కలిగించే తెలుగు కథలు లభ్యమవుతాయని తెలిపారు. అవి విద్యార్థులు చదడం ద్వారా పఠనాసక్తితోపాటు శ్రవణ, ఆలోచన నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో అమలవుతున్న ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రూం టు రీడ్ డిస్ట్రిక్ లీడ్ కోఆర్డినేటర్ జెన్నీఫర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి వాసికి 'సాహితీ చంద్ర' పురస్కారం


అభిలాష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

వాంకిడి, మే 6: వాంకిడి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు నూతి అభిలాష్ కవిగా, రచయితగా తెలుగు, ఆంగ్ల సాహిత్యంలో అనేక రచనలు చేశారు. తాను చేసిన కృషికి గాను సోమవారం మంథని వేదికగా అంతర్జాతీయ గుర్తింపుపొందిన గౌతమేశ్వర సాహితీ కళాసేవాసంస్థ వారు నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా నూతి అభిలాష్‌కు సాహితీచంద్ర పురస్కారాన్ని, 'కలం' అవార్డును సంస్థసభ్యులు శ్రీధర్, పురంమంగ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, పర్యావరణ వేత్తలు, కళాకారులు అభిలాష్‌ను అభినందించారు.

ఆయిల్‌పామ్ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా ఉద్యానవన శాఖాధికారి వెంకటేశం

ఆసిఫాబాద్ రూరల్, మే 6: వేసవిలో ఆయిల్‌పామ్ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి వెంకటేశం అన్నారు. వేసవిలో ఆయిల్‌పామ్ పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఉద్యానవన కార్యాలయంలో అధికారులతో కలిసి ఉద్యానవన అధికారి వెంకటేశం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 900నుంచి వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారన్నారు. ఎండలు ఎక్కువ కావడంతో భూగర్భ జలాలు అడుగంటుకుంటున్నాయి. ఈ సమయంలో రైతులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాల న్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్ర మంలో ఉద్యానవ అధికారులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల కుదింపు చర్యలు మానుకోవాలి

కాగజ్‌నగర్, మే 6: రాష్ట్రంలో కొత్త జిల్లాల కుదించే చర్యలు వెంటనే మానుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. కొత్త జిల్లాలతో పాలన సౌలభ్యం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కూడా తగ్గినట్టు తెలిపారు. కొత్తజిల్లాలను కుదించే ఆలోచనను వెంటనే మానుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు నారాయణ, పూర్ణ చందర్ రావు, కలికోట రమణయ్య, ఎల్లాగౌడ్, నాగేశ్వర్ రావు, రామయ్య, పురుషోత్తం, ఉపేందర్, వాహబ్, తదితరులు పాల్గొన్నారు.

స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

కాగజ్‌నగర్, మే 6: కాగజ్‌నగర్ మెయిన్ మార్కెట్‌లోని చిరువ్యాపారులకు స్పర్శ ఫౌండేషన్, సిర్పూరు పేపర్ మిల్లు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిల్లు ప్రతినిధులు మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో గొడుగులతో ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు తుమ్మరమేష్, నాగేశ్వర్‌రావు, స్పర్శ ఫౌండషన్ సభ్యులు రీనా బివాల్, అశోక్, సుందరం, సుశీల, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

'నీట్' ప్రశ్నపత్రం తారుమారు

- ఒక సెట్‌కు బదులు మరోసెట్
- కీ పేపరు విడుదలతో బయటపడ్డ వ్యవహారం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పరీక్ష కేంద్రంలో విచారణ చేపట్టిన ఆర్డీవో


కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆసిఫాబాద్, మే 6: వైద్యవిద్యలో చేరేందుకు ప్రతి ఏటా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పరీక్షను నిర్వహిస్తుంది. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తొలిసారిగా నీట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా పరీక్షకేంద్రంలోని నిర్వాహకుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఎన్‌టీఏ మార్గదర్శకల ప్రకారం ఇవ్వాల్సిన ప్రశ్నపత్రాన్ని కాకుండా వేరే ప్రశ్నపత్రాన్ని విద్యార్థులకు అందజేశారు. ఈ విషయం సోమవారం పరీక్షకు సంబంధించిన కీని విద్యార్థులు పరిశీలించడంతో బయల్పడింది. కీని పరిశీలించిన విద్యార్థులు తాము రాసిన ప్రశ్నపత్రానికి సంబంధించిన కీ వివరాలు లేకపోవడంతో ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఆందోళనకు గురైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జరిగిన వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.


పరీక్ష కేంద్రంలో విచారణ చేస్తున్న ఆర్డీవో లోకేశ్వర్‌రావు

అసలేం జరిగింది?

ఆదివారంజిల్లాకేంద్రంలోని ఆసిఫాబాద్ హైస్కూల్(ఆసిఫాబాద్ మోడల్‌స్కూల్)లో నీట్‌పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 323 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 299 మంది హాజరయ్యారు. నీట్ పరీక్షకు సంబంధించిన పేపర్‌ను రెండు సెట్లుగా రూపొందించారు. ఒకసెట్ పేపరు ఎస్బీఐ బ్యాంకులో, మరోసెట్ పేపరు కెనరా బ్యాంకులో ఉంచారు. దేశవ్యాప్తంగా ఎస్బీఐలోని పేపరు సెట్‌ను తీసుకోవాల్సిందిగా సెంటర్ నిర్వాహకులను ఎన్‌టీఏ మెయిల్ ద్వారా సందేశం పంపారు. కానీ నిర్వాహకుల నిర్లక్ష్యం, తప్పిదంతో ఎస్బీఐ సెట్‌కు బదులు కెనరా బ్యాంకులోని సెట్‌ను తీసుకువచ్చి విద్యార్థులకు అందజేశారు. దీంతో విద్యార్థులు మొత్తం మంది ఆ సెట్‌పేపరులో వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేశారు. సోమవారం విద్యార్థుల కళాశాలలు నీట్ పరీక్షకు సంబంధించిన కీ పేపరును విడుదల చేశారు. జిల్లాలో పరీక్ష రాసిన విద్యార్థులు కీ పేపరును చూసుకోగా వారు రాసిన దానికి కీ పొంతన లేకపోవడంతో కంగుతిన్నారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పరీక్షకేంద్రం నిర్వాహకుల అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యంతోనే ప్రశ్నపత్రం ఒకటికి బదులుగా మరొకటి ఇచ్చారని అన్నారు కాగా వారు ఇచ్చిన ప్రశ్నపత్రానికి బార్‌కోడ్ కూడా లేదని వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆర్డీవో లోకేశ్వర్‌రావును ఆదేశించారు.

ఆర్డీవో విచారణ..

ప్రశ్నపత్రం తారుమారుపై ఆర్డీవో లోకేశ్వర్‌రావు పరీక్ష కేంద్రానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేంద్రం కోఆర్డినేటర్‌ను విచారించారు. పరీక్ష కేంద్రం నిర్వాహకుల తప్పిదంవల్లే ఒకసెట్ పేపరుకు బదులు మరోసెట్‌ను విద్యార్థులకు ఇచ్చినట్లు విచారణలో నిర్ధారించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ విషయమై కలెక్టర్ వెంకటేష్ దోత్రే విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులు రాసిన ప్రశ్నపత్రాన్ని పరిగనలోకి తీసుకొని మూల్యాంకణం చేస్తామని ఎన్‌టీఏ అధికారులు పేర్కొన్నారని తెలిపారు.

కీ పేపరును చుశాక తెలిసింది : దాసరి దీపాంగి, విద్యార్థిని



జిల్లా కేంద్రంలో నీట్ ప్రవేశపరీక్ష రాశాను. సోమవారం నేను చదివిన కళాశాల నుంచి కీ పేపరు పంపించారు. దానితో పోల్చుకున్నపుడు నేను రాసిన ప్రశ్నపత్రానికి కీకి సరిపోలలేదు. దీంతో వెంటనే స్నేహితులకు ఫోన్‌చేసి తెలుసుకున్నాను. అప్పుడు పేపరు తారుమారు అయినట్లు గుర్తించాను.

తాము రాసిన ప్రశ్నపత్రాన్ని పరిగణలోకి తీసుకోవాలి: కోట రాగవీణ , విద్యార్థిని



జిల్లా కేంద్రంలో నీట్ ప్రవేశ పరీ క్షలో ప్రశ్నపత్రం తారుమారైంది. మేము రాసిన ప్రశ్నపత్రాన్ని పరి గణ లోకి తీసుకొని మూల్యాంకనం చేసి ఫలితాలు విడుదల చేయాలి. లేకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 6: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులలో భాగంగా పోలింగ్‌కేంద్రాలు కలిగిన పాఠశాలల్లో పనులను నాలుగు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్‌తో కలిసి విద్యాశాఖాధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, పంచాయతీ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీనియోజకవర్గాల్లో ఈనెల 13న జరుగనున్న లోక్‌సభ పోలింగ్ కొరకు జిల్లాలో అమ్మఆదర్శ పాఠశాలలకు ప్రాధాన్యత ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుదీ కరణ, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, ర్యాంపుల నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

సింబల్ లోడింగ్ యూనిట్ల స్టోరేజ్ గదిని పరిశీలించిన కలెక్టర్

సింబల్ లోడింగ్ యూనిట్ల స్టోరేజ్ గది వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లోని స్టోరేజ్ గదిలో భద్రపరిచిన సింబల్ లోడింగ్ యూనిట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సిర్పూర్ సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి, ఆసిఫాబాద్ సహాయ ఎన్నికల అధికారి దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ఉపయోగించిన సింబల్ లోడింగ్ యూనిట్లను స్టోరేజ్ గదిలో భద్రపరిచి గదికి సీలు వేశామని తెలిపారు. స్టోరేజీ వద్ద భద్రత పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ మధుకర్, నాయబ్ తహసీల్దార్ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


సిర్పూర్(టి)లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీఓ భిక్షపతిగౌడ్

సిర్పూర్(టి), మే 6: పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు పోలింగ్‌కేంద్రాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, దివ్యాంగులకు ర్యాంపులు ఉండేలా చూడాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించి వేసవిలో మొక్కలు ఎండి పోకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట డీఎల్‌పీవో సురేష్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

వాంకిడి: మండలంలోని ఆర్లి, సవాతి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీవో ఖాజా అజీజుద్దీన్ పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరాతీశారు. పోలింగ్ కేంద్రాల్లో అన్నిసదుపాయాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో 46.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, మే 6: కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం 46.0 డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెబ్బెన, కాగజ్‌నగర్, తిర్యాణి మండలాల్లో 46.0డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఆసిఫాబాద్‌లో 45.6, కెరమెరిలో 44.9, వాంకిడి, కౌటాలలో 44.4, దహెగాంలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు టి శ్రీనివాస్

కాగజ్‌నగర్, మే 6: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ఆ పార్టీ తరుపున బరిలో ఉన్న ఆత్రం సుగుణకు ఓటేసి గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం మతాన్ని తెరలేపుతున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా అంతా తేరుకొని కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు చాంద్‌పాషా, పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి, ఎఐకేఎంఎస్ జిల్లా నాయకులు రత్నం, పోశన్న, లచ్చన్న, ఇఫ్టూ జిల్లానాయకులు బండారి తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పెద్దపల్లి కిషన్ రావు

కాగజ్‌నగర్, మే 6: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ లోక్‌సభకు ఎన్నికల నిర్వహణ కోసం కార్యనిర్వహక అధ్యక్షుడిని నియమించింది. సిర్పూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెద్దపల్లి కిషన్‌ను రావును అధ్యక్షుడిగా నియమిస్తూ ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తునికాకు సేకరణ ప్రారంభం


బెజ్జూరులో తునికాకు కట్టలు కడుతున్న కూలీలు

బెజ్జూరు/చింతలమానే పల్లి, మే 6: బెజ్జూరు రేంజ్ పరిధిలోని పలు గ్రామాల్లో, చింతలమానే పల్లి మండలం కర్జెల్లి రేంజ్ పరిధిలో సోమవారం కర్జవెల్లితో పాటు పలు గ్రామాల్లో తునికాకు సేకరణ ప్రారంభమైంది. వేసవి పంటగా భావించే తునికాకు సేకరణతో కూలీలు ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశం ఉంది. గ్రామాల్లో వేకువజామున అటవీప్రాంతానికి వెళ్లి తునికాకు సేకరించి కట్టలు కట్టికల్లాల్లో విక్రయిస్తారు.

ప్రతిఏటా మే మొదటి వారం రోజులు తునికాకు సేకరణ ప్రారంభమవుతుంది. కాగా కొన్నేళ్లుగా కట్టధర పెంచాలని కూలీలు చెబుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. ఈ తునికాకు సేకరణ నెల రోజు పాటు సాగనుంది.



ఓసీలలో పనివేళలు మార్చాలి

● సీఎండీకి ఏఐటీయూసీ వినతి

మంచిర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రం కావడంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓపెన్‌కాస్టు గనులలో పనివేళలు మార్చాలని కోరుతూ సీఎండీ బలరాంనాయక్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకొని విధుల వేళలు మార్చాలని కోరగా సీఎండీ సాను కూలంగా స్పందించినట్లు తెలిపారు. మొదటి షిఫ్ట్ ఉదయం 7మధ్యాహ్నం ఒంటిగంట వరకు (మధ్యాహ్న భోజన విరామం లేకుండా), రెండోషిఫ్ట్ 4నుంచి రాత్రి11గంటల వరకు సమయసారిణి మార్చడంతోపాటు రాత్రి షిఫ్టును యథావిధిగా ఉంచాలని కోరగా, ప్రొడక్షన్ తగ్గకుండా సర్దుబాటు చేసుకొనేందుకు అనుమతినిచ్చినట్లు వారు తెలిపారు. ఈ విషయమై ఆయా ఏరియాల జీఎంలు ప్రొడక్షన్ విషయంలో అంగీకరిస్తే పైన తెలిపిన పనివేళలు అమలు అవుతాయని, లేనిపక్షంలో పాతపద్ధతి ప్రకా రం ఉదయం 7నుంచి 3గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి రాత్రి 11గంటల వరకు, తిరిగి రాత్రి11నుంచి ఉదయం 7గంటలవరకు అమలయ్యే అవకాశాలు న్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున ఎన్నికల విధులు నిర్వహించే మినిస్టీరియల్ స్టాఫ్, సెక్యూరిటీ సిబ్బంది విష యంలో ఆన్‌డ్యూటీగా పరిగణించాలని సీఎండీని కోరగా, ఎన్నికలకు హాజ రయ్యే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సింగరేణిలో కూడా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలి


సీఎండికి వినతి పత్రం ఇస్తున్న సీతారామయ్య

వందమ్రిటౌన్, మే 6: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే సింగరేణి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పరిగణించాలని కోరుతూ సింగరేణి సీఎండీ బలరాంకు గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతారామయ్య వినతి పత్రం అందించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఎండీ కార్యాల యానికి వెళ్లి వినతిపత్రం అందించారు. ఎన్నికల విధులు నిర్వహించే సింగరేణి ఉద్యోగులు నష్టపోతున్నారని, ఓడీ మస్టరు కట్టడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆన్‌డ్యూటీగా పరిగణించాలని కోరారు.

కార్మికుల పనివేళలు మార్చండి : బీఎంఎస్

శ్రీరాంపూర్, మే 6: అధికఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని సింగరేణిలో కార్మికుల పనివేళలు మార్చాలని సింగరేణికోల్‌మైన్స్ కార్మికసంఘ్ (బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా షిఫ్ట్ సమయాలను ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 11గంటల వరకు వేళలు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

కౌటాల, మే 6: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన బొగరపు భీంరావు(35) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కమల, ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంరావుకు అదేగ్రామానికి చెందిన సౌజన్యతో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా భీంరావు మద్యంకు బానిస కావడంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సౌజన్య తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో భీంరావు ఆదివారం రాత్రి సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు అతనికి నచ్చచెప్పి కిందికి దించారు. అదేరోజురాత్రి మళ్లీ టవర్‌ఎక్కి ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు బలమైన గాయావలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం గ్రామానికి చెందిన చిన్నయ్య చూసి కుటుంబీకులకు సమాచారం అందించాడు. మృతుడితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. ఒకరిపై కేసు నమోదు

రెబ్బెన, మే 6: రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్‌అధికారులు దాడులు నిర్వహించారు తక్కపల్లి, కొత్తగూడెం గ్రామాల్లో 900లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ తెలిపారు. ఆత్రం సక్కు నాటుసారా అమ్ముతుండగా పట్టుకున్నట్టు, రెండు నాటుసారా బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు వివరించారు. దాడుల్లో ఎస్సై సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.